andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 కనిష్ఠం 25.8


ఆంధ్రజ్యోతి

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

బుధవారం 3 జూలై 2024







# జోరుగా నాట్లు

- ఊపందుకున్న వానాకాలం సీజన్
- రూరల్ మండలంలో బీహార్, పశ్చిమ బెంగాల్ కూలీలతో నాట్లు

నిజామాబాద్ రూరల్, జూలై 2: జిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. తరచుగా మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పొలంబాట పట్టారు. నేలను చదునుచేసి సిద్ధంగా ఉంచుకున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నాట్లు వేశారు. నాట్లు వేసేందుకు గ్రామంలో ఎవరూ ముందుకు రావడం లేదు. దాంతో రైతులు ఎప్పటిమాదిరిగానే బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే కూలీలపైనే ఆధారపడ్డారు. జిల్లాలోని వర్ని, మల్కాపూర్ తండా, జలాల్‌పూర్ వంటి కొన్ని తండావాసులు మాత్రమే నాట్లు వేసేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలోని వరిసాగు చేసే రైతులకు పొలంపనులకు సరిపడా వ్యవసాయ కూలీలు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను బీహార్, పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన కూలీలు తీరుస్తున్నారు. సంవత్సరానికి రెండుసార్లు సీజన్ ప్రారంభం కాగానే జిల్లాకు వస్తున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చే ఈ కూలీలు గ్రామాల్లోనే తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని నాట్లు వేస్తున్నారు. ఎకరాకు రూ.4వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు 12 నుంచి 20 మంది వరకు కూలీలు పనులు చేస్తున్నారు. రైతులు కూడా తమ పొలం పనులను వీరికి గుత్తకు ఇస్తున్నారు. వారికి ఉండేందుకు నివాసం, వండుకునేందుకు బియ్యం ఇతర సామగ్రి అందిస్తున్నారు. వీరు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాట్లు వేసే పనిలో నిమగ్నమవుతున్నారు. రూరల్ మండలంలోని పాల్ద, తిర్మన్‌పల్లి, ఆకుల కొండూరు, గుండారం, మల్కాపూర్, జలాల్‌పూర్, కాలూరు, మల్లారం, మల్కాపూర్, కొత్తపేటలలో బీహార్ కూలీలు వ్యవసాయ పనులు చేస్తున్నారు. సీజన్‌లో నెల రోజుల పాటు పనులు చేసి ఒక్కొక్కరం రూ.40 నుంచి రూ.60వేల వరకు సంపాదించుకుంటున్నామని బీహార్ కూలీలు ఆనందంగా తెలిపారు. స్థానికులు నాట్లు వేసేకంటే బీహార్, పశ్చిమ బెంగాల్ కూలీలు క్రమపద్ధతిలో వేస్తున్నారని తన 10 ఎకరాల భూమిని గుత్తకు ఇచ్చిన కాలూరు రైతు గంగారెడ్డి తెలిపారు.

# రైతులచూపు.. ఎస్సారెస్పీ వైపు!

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టంపై ఉత్తర తెలంగాణ రైతుల దృష్టి
- ప్రాజెక్టు నిండితే పంటలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు
- ప్రతీ సీజన్‌లో 12లక్షల ఎకరాల వరకు ఆయకట్టుకు నీటివిడుదల
- ప్రాజెక్టులో ప్రస్తుతం అతితక్కువగా ఉన్న నీటి నిల్వలు

నిజామాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణ జిల్లాల రైతుల చూపంతా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైనే ఉంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతున్నా.. ప్రాజెక్టు సామర్థ్యానికి మించి నీటిని ఆయకట్టుకు అందిస్తున్నారు. రెండు పంటలకు సాగునీరును విడుదల చేస్తున్నారు. నలభై ఏళ్లలో ప్రాజెక్టులో 32 టీఎంసీల నిల్వ సామర్థ్యం తగ్గినా ఇప్పటికి కాకతీయ కాలువ స్టేజ్-2 రైతులు కూడా ఈ నీటి కోసమే ఎదురు చూస్తున్నారు. కాళేశ్వరం రీడిజైన్ పేరిట ఇతర ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఎస్సారెస్పీ పైన ఒత్తిడి మాత్రం తగ్గలేదు. ప్రాజెక్టు పూడికతో కూరుకుపోతున్నా.. ప్రతి యేడు మాత్రం రైతులకు సాగునీరును అందిస్తున్నారు. కాళేశ్వరం బీటలు వారి నీటిని అందించే పరిస్థితుల్లో లేకపోవడంతో ఉత్తర తెలంగాణలోని రైతుల ఆశలన్నీ ఈ ప్రాజెక్టుపైనే ఉన్నాయి. ఈయేడు ఇంకా వర్షాలు పూర్తిస్థాయిలో ఊపందుకోకపోవడం వల్ల వరద రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్ణయంతో సన్నరకాలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్న రైతులు ప్రాజెక్టులో నీళ్లు వస్తే ఎక్కువ మొత్తంలో వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఏటా ఎస్సారెస్పీలోకి జూలై నుంచి అక్టోబరు వరకు ఎక్కువగా వరద రావడంతో ఈయేడు కూడా అలాగే వస్తుందని ఎదురు చూస్తున్నారు.

### నెహ్రూ హయాంలో నిర్మాణం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ప్రధాని నెహ్రూ హయాంలో చేపట్టారు. ఈ ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టును 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం అయిన తర్వాత పదేళ్లలోపే ఎక్కువగా పూడిక చేరడం వల్ల సామర్థ్యం తగ్గిపోయింది. అధికారులు 90 టీఎంసీలే ఉన్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత గత రెండేళ్ల నుంచి చేసిన సర్వే ఫలితాల ఆధారంగా ప్రస్తుతం నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ఉన్నట్లు అధికారికంగా నిర్ధారించి ప్రకటన చేశారు. ఎస్సారెస్పీ నిర్మాణం చేసేటప్పుడు ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్‌తో పాటు నల్గొండ జిల్లాలోని సూర్యాపేట్ వరకు కాకతీయ కాలువ ద్వారా సాగునీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నారు. సరస్వతీ కాలువ ద్వారా ఆదిలాబాద్, లక్ష్మి కాలువ, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, ఎత్తిపోతల పథకం, గుత్పలఅలీసాగర్ ద్వారా జిల్లాలో నీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నారు. కాకతీయ కాలువ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వరకు సరఫరా చేశారు. కాకతీయ కాలువ స్టేజ్-2 కింద సూర్యాపేట జిల్లా వరకు గత సంవత్సరం వరకు నీటిని అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నీటిని మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరు, లోయర్ మానేరు ద్వారా నీటిని తరలించారు. ఎస్సారెస్పీపై వీటి ఆయకట్టు డిజైన్ చేసిన పూడిక మట్టి చేరడం వల్ల ప్రతి సంవత్సరం రెండు పంటలకు నీటిని అందించడం కష్టంగా ఉండటం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ కింద కరీంనగర్, వరంగల్, సూర్యాపేట వరకు నీటిని మళ్లింపు చేశారు. ఎస్సారెస్పీ నీటిని నిజామాబాద్, ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్ వరకు ఎల్ఎండీ ఎగు వన అందించారు. నీటి నిల్వలు లేని సమయంలో మిడ్ మానేరుకు వరద కాలువ ద్వారా తరలింపు చేసి ఎల్ఎం డీకి తరలించి కాకతీయ కాలువ ద్వారా వరంగల్ జిల్లా వరకు నీటిసరఫరా చేశారు.

### ఎల్ఎండీ ఎగువకు సాగు నీరు

కాళేశ్వరం మొదలైనప్పటి నుంచి ఎల్ఎండీ ఎగువ ఉన్న ఆయకట్టుకు అందిస్తున్నారు. గత యాసంగిలో కాళేశ్వరం నీటిని విడుదల చేయకపోవడం వల్ల సూర్యాపేట వరకు తరలించడం వల్ల ప్రాజెక్టులో నీరు అడుగంటిపోయింది. కేవలం తాగునీటి వరకే నిల్వలు ఉన్నాయి. ఈ సంవత్సరం వర్షాలు మొదలైన ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి భారీ వరదలు మొదలు కాలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరే సమయంలో ఆయకట్టుకు వరదను మళ్లింపు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో 12లక్షల ఎకరాల వరకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెండు సీజన్‌లు కలిపి అన్ని కాల్వలు ఎత్తిపోతల పథకాల కింద 24లక్షల ఎకరాల వరకు పంటలకు నీటిని అందిస్తు న్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక భారీగా చేరడం వల్ల కెపాసిటి 32 టీఎంసీలకు తగ్గిపోయింది. ప్రాజె క్టులో 80.5 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయి. ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ కింద 5 టీఎంసీలు నీటిని ఉంచితే 75 టీఎంసీలు మాత్రమే వ్యవసాయానికి అందుబాటులో ఉంటాయి. భారీ వరదలు వస్తే ఒక సీజన్‌కు పూర్తిస్థాయిలో నీటిని మళ్లించి రెండో సీజన్‌కు ఉపయోగిస్తారు. యాసంగి మొదలయ్యే నాటికి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటే ఆన్ ఆఫ్ పద్ధతిలో 9లక్షల ఎకరాల వరకు సాగునీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టుతో పాటు ఎల్ఎండీలో ఉన్న నీటిని కలిపితే 12లక్షల ఎకరాల వరకు నీటిని అందిస్తారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తిగా నిండితేనే పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టులో ఎక్కువగా పూడిక చేరడం వల్ల కాళేశ్వరం నీటిని మళ్లించకుంటే మొత్తం ఆయకట్టుకు సాగునీటిని అందించే పరిస్థితి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఉత్తర తెలంగాణలో ఏకైక భారీ ప్రాజెక్టు

ఉత్తర తెలంగాణలో ఎస్సారెస్పీ ఏకైక భారీ ప్రాజెక్టు. ఇది పూర్తిస్థాయిలో నిండితేనే మొత్తం సాగు అవుతుంది. కాలువల కిందనే కాకుండా భూగర్భ జలాలు పెరిగి బావుల కింద కూడా పంటలను రైతులు వేస్తారు. కాళేశ్వరం నీటిమళ్లింపు ఉంటేనే రైతులకు రెండు పంటలకు పూర్తిస్థాయిలో అందుతాయి. రైతులు మాత్రం ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ ప్రకటించడంతో ఈ వానాకాలంలో ఎక్కువగా వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. సన్నరకాలు సాగు చేయడం వల్ల నీటి వినియోగం కూడా ఎక్కువగా ఉండనుంది. వర్షాకాలం ఆరంభమై నెల రోజులైనా ఇప్పటికి మాత్రం ప్రాజెక్టులోకి భారీగా వరద రాలేదు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1091 అడుగులకు గాను 1059.60 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 10.188 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రతిరోజూ 3762 క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. వానాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు 3.875 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. ప్రాజెక్టులోకి ఏటా జూలైలోనే ఎక్కువగా వరద మొదలవుతుందని ఆగస్టులో ప్రాజెక్టు గేట్‌లు ఎత్తుతామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సగానికి నిండిన తర్వాత ఆయకట్టుకు నీటి విడుదలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వారు తెలిపారు.




# వ్యవసాయ రుణప్రణాళిక ఖరారు

- జిల్లాలో వానాకాలం, యాసంగి కలిపి రూ.4402.76 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయం
- వానాకాలంలో రూ.2600 కోట్ల రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వనున్న బ్యాంకులు

నిజామాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వ్యవసాయ రుణ ప్రణాళికను ఖరారు చేశారు. ఈ రుణప్రణాళికకు అనుగుణంగా వ్యవసాయానికి, వ్యవసాయేతర రంగాలకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు పంటలను వేస్తుండటంతో అన్ని బ్యాంకుల శాఖలకు లక్ష్యాలను నిర్ణయించారు. ఆయా గ్రామాల పరిధిలో రైతులు వేసే పంటలకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు దఫాలు సమీక్షించిన అధికారులు ఈ సంవత్సరం రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు రుణ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను చేశారు. కొన్ని బ్యాంకుల పరిధిలో ఇప్పటికే రుణాలు ఇస్తుండగా మరికొన్ని బ్యాంకు శాఖల ఆధ్వర్యంలో అడిగిన రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం రైతులకు సంబంధించి 2లక్షల వరకు రుణాలు మాఫీ చేసే అవకాశం ఉండటంతో రైతులు కొంతమేర పెట్టుబడులకు ఇతర మార్గాల నుంచి సమకూర్చుకుంటున్నారు.

### పంటలకు అనుగుణంగా రుణాలు

జిల్లాలో పంట రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పంటలు వేసే రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. వానాకాలంతో పాటు యాసంగి పంటలకు కూడా రుణాలు ఇచ్చే విధంగా ఈ రుణ ప్రణాళికలో పొందుపర్చారు. రైతులందరికీ అవసరమైన మేరకు బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం వానాకాలం, యాసంగి కలిపి 4402.76 కోట్ల రూపాయలను పంట రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. రైతుల భూముల విస్తీర్ణం బట్టి వేసే పంటల ఆధారంగా ఈ రుణ పంపిణీ చేయాలని బ్యాంకర్ల కమిటీలో తీర్మానం చేశారు. ఈ వానాకాలంలో 2640 కోట్ల రూపాయలను రైతులకు రుణాలుగా ఇచ్చేందుకు నిర్ణయించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, గ్రామీణ, సహకార బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకులకు లక్ష్యాలు నిర్ణయించారు. ఆ బ్యాంకు శాఖలో ఉన్న గ్రామాల పరిధిలో నిర్ణయించిన మేరకు పంట రుణాలు ఇవ్వాలని ఆదేశాలను ఇచ్చారు. జూలై నుంచి సెప్టెంబర్ నెల వరకు రుణాలను నిర్ణయించిన మేర అందించాలని ఆదేశాలను ఇచ్చారు. ఈ రుణాల పంపిణీపై ప్రతి వారం సమీక్షించడంతో పాటు బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. పంట రుణాలతో పాటు రైతులకు దీర్ఘకాలిక రుణాలను కూడా ఇచ్చేందుకు సమావేశంలో నిర్ణయాలను తీసుకున్నారు. రైతులు యాంత్రికరణలో భాగంగా ట్రాక్టర్లు, ట్రిల్లర్లు, హార్వెస్టర్లతో పాటు ఇతర వ్యవసాయానికి సంబంధించిన యంత్రాలు కొనుగోలు చేయడంతో పాటు డ్రిప్, ఇతర సామాగ్రి కొనుగోలుకు ఈ రుణాలను పంపిణీ చేయనున్నారు. రైతుల భూ విస్తీర్ణానికి అనుగుణంగా రుణాల పంపిణీకి ఏర్పాట్లను చేస్తున్నారు.

### వరికి ఎకరాకు రూ.45వేలు

జిల్లాలో రైతులకు వానాకాలంతో పాటు యాసంగిలో పంట రుణాలను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. రైతులు వేసే పంటల ఆధారంగా బ్యాంకర్ల కమిటీ ఈ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించింది. ప్రతి సంవత్సరం పంటల దిగుబడి, పెట్టుబడి ఆధారంగా రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటారు. బ్యాంకర్ల కమిటీలో చర్చించిన మీదట ప్రతి సంవత్సరం ఇచ్చే రుణాలను పెంచుతున్నారు. ఈ సంవత్సరం వరికి ఎకరాకు 45వేలు ఇచ్చే విధంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో నిర్ణయం తీసుకున్నారు. గత సంవత్సరం 43000 రూపాయలను ఎకరాకు రుణాన్ని ఇచ్చారు. రైతులు వరి విత్తనం సాగు చేస్తే ఎకరాకు 50వేల రూపాయల రుణాన్ని ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సంవత్సరం జవార్‌కు ఎకరాకు 20వేలు, జొన్నకు 17వేలు, రాగులకు 17వేలు, మొక్కజొన్నకు 34వేలు, గోదుమకు 21వేలు చిరు ధాన్యాలకు ఎకరాకు 20వేలు, కందులకు ఎకరాకు 24వేలు, మినుములకు ఎకరాకు 17వేల రూపాయలు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా రైతులకు వానాకాలంతో పాటు యాసంగిలో రుణాలను అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఇవేకాకుండా చెరకు, పసుపు, పండ్ల తోటలకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచారు. జిల్లాలో అత్యధికంగా వరిసాగు చేస్తున్నందున ఎక్కువ మొత్తంలో రైతులకు ఎకరాకు 45వేల రూపాయలను ఈ సంవత్సరం పంట రుణాలుగా అందించనున్నారు. అన్ని బ్యాంకులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణ పంపిణీ చేయాలని ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలో ఈ సంవత్సరం పంట రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశామని లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తెలిపారు. వానాకాలంతో పాటు యాసంగి సాగుకు కూడా ఈ రుణాలను అందిస్తామన్నారు. రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను కూడా ఇచ్చేందుకు బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ రుణాలన్నింటిని వచ్చే సెప్టెంబర్ చివరి లోపు లక్ష్యాలకు అనుగుణంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.



# వెల్‌నెస్ సెంటర్‌లో వసతుల లేమి!

- వెల్‌నెస్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కరువు
- ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరితోనే వైద్య సేవలు
- ఇరుకైన గదులతో తప్పని ఇబ్బందులు
- ఇప్పటికే మూడుచోట్లకు మారిన వెల్‌నెస్ సెంటర్

సుభాష్‌నగర్, జూలై 2: ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడుతోంది. వెల్‌నెస్ సెంటర్ ప్రస్తుతం నగర పాలక సంస్థ పాత భవనంలోని పౌరసరఫరాల కేంద్రంలో కొనసాగుతోంది. డాక్టర్లకు ప్రత్యేకంగా గదులను కేటాయించకపోవడంతో పరదాలు అడ్డుపెట్టి చికిత్సను నిర్వహిస్తున్నారు. రోగులు నిలబడటానికి కూడా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కుర్చీలు మాత్రమే ఉండటంతో రోగులు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మెడిసిన్ డబ్బాలతో వెల్‌నెస్ సెంటర్ మొత్తం నిండిపోతోంది. సగానికి పైగా స్థలాన్ని మెడిసిన్‌లు ఆక్రమించడంతో మిగతా కొంత మొత్తంలో సిబ్బంది తమ సేవలను కొనసాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా పక్కన ఉన్న మున్సిపల్ భవనాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులకు అడిగిన ఇవ్వడం లేదు. ఇప్పటికే రిటైర్డ్ ఉద్యోగులు సైతం ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

### ఇప్పటికే మూడుసార్లు సెంటర్ మార్పు..

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వెల్‌నెస్ సెంటర్ కోసం చాలా స్థలాలను వెతికి చివరకు పాత కలెక్టరేట్ కార్యాలయం పక్కన గల రెవెన్యూ గెస్ట్‌హౌజ్‌లో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలోనే పాత కలెక్టరేట్‌ను కూల్చివయగా వెల్‌నెస్‌సెంటర్‌ను అక్కడి నుంచి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలోని నాలుగో అంతస్తులో ఏర్పాటు చేశారు. వెల్‌నెస్ సెంటర్‌ను 4వ అంతస్తు నుంచి మార్చాలని రిటైర్డ్ ఉద్యోగులు పలుమార్లు అధికారులకు విన్నవించగా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి పక్కనగల బిల్డింగ్‌లోకి మార్చారు. అది కూడా సరిపోకపోవడంతో మున్సిపల్ కార్యాలయం నూతన బిల్డింగ్‌లోకి వెళ్లిపోగానే ఖాళీగా ఉన్న పాత మున్సిపల్ కార్యాలయంలోకి మార్చారు. మూడు చోట్ల మార్చినా ఇప్పటికీ సరైన భవనాన్ని కేటాయించలేదు. ఇప్పటికీ అరకొర వసతులతోనే కొనసాగుతోంది. కావాల్సినంత చోటు లేకపోవడంతో రోగులతో పాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

### వేధిస్తున్న వైద్యుల కొరత

వెల్‌నెస్ సెంటర్‌ను డాక్టర్ల కొరత కూడా వేధిస్తోంది. ఎంబీబీఎస్ డాక్టర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరితోనే కొంతకాలంగా కొనసాగుతోంది. మధ్యలో అడపాదడపా ఇద్దరు డాక్టర్లు ఉన్నా.. నిలకడగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం ప్రస్తుతం ఉన్న డాక్టర్ పది రోజులు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లడంతో పదిరోజుల పాటు డాక్టర్ లేక రోగులు ఇబ్బంది పడ్డారు. పది రోజుల పాటు డాక్టర్ వచ్చే వరకు వెల్‌నెస్ సెంటర్‌లో నామమాత్రపు సేవలే కొనసాగాయి. రెండో డాక్టర్ కోసం ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ జారీ చేశారు. రెండవ డాక్టర్ కోసం ఉన్నతాధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం రెండవ డాక్టర్ రావాల్సి ఉండగా ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారులు రెండవ డాక్టర్‌ను తొందరగా నియమించాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరుతున్నారు.

### కనీస సదుపాయాలు కరువు

పాత మున్సిపల్ కార్యాలయ భవనంలో వెల్‌నెస్ సెంటర్ మార్చినప్పటి నుంచి సరైన సదుపాయం లేవు. మహిళా సిబ్బందితో పాటు డాక్టర్లు సైతం ఒంటికి, రెంటికి పోవాలంటే అక్కడ వసతి లేకపోవడంతో నడుచుకుంటూ కొత్త మున్సిపల్ కార్యాలయ భవనంలోకి వెళ్తున్నారు. మున్సిపల్ కార్యాలయం పాత భవనం పక్కన నీటి వసతి లేకపోవడంతో టాయిలెట్స్ నిరుపయోగంగా మారాయి. అలాగే సరైన సదుపాయాలు లేకపోవడంతో వివిధ విభాగాలకు చెందిన సామగ్రి నిరుపయోగంగా పడిఉంది. వెల్‌నెస్ సెంటర్‌లో డెంటల్, ఫిజియోథెరపీ, ఇసిజి, తదితర విభాగాలకు చెందిన సామగ్రి నిరుపయోగంగా మూలన పడి ఉంది. జిల్లా యంత్రాంగానికి రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు ఎన్నిసార్లు మొరపెట్టినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

### సరైన వసతులు కల్పించాలి..

**: రామ్మోహన్‌రావు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ యూనియన్ నాయకుడు**

ప్రస్తుతం కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్‌లో కనీస సదుపాయాలు లేవు. రిటైర్డ్ ఉద్యోగులు క్యూ లైన్ వద్ద ఎండలకు, వానలకు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ విభాగాలకు సంబంధించిన సామగ్రి నిరుపయోగంగా ఉంది. జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేసినా సౌకర్యాలు కల్పించడం లేదు. వెంటనే వెల్‌నెస్ సెంటర్‌లో పూర్తి సౌకర్యాలు కల్పించాలి.

## సాదాసీదాగా సాగిన బోధన్ సర్వసభ్య సమావేశం

బోధన్‌రూరల్,జులై2: బోధన్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదా కొనసాగింది. బోధన్ మండల పరిషత్ సర్వసభ్య చివరి సమావేశం మంగళవారంతో ముగిసింది. రేపటితో పదవి కాలం ముగుస్తుండడంతో పాలకవర్గాన్ని మండల స్థాయి అధికారులు ఘనంగా సన్మాంచి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ, బుద్దె సావిత్రి రాజేశ్వర్ జడ్పీటీసీ లక్ష్మి గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రజలకు అనేక సేవలు చేశామని కొనియాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల కోసం కృషి చేసిన ఎంపీటీసీలను కొనియాడారు. ఇటీవల మృతి చెందిన సాలూర విండో మాజీ చైర్మన్ బుద్దె రాజేశ్వర్, కొప్పర్గ సర్పంచ్ ఖలీల్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ శరత్, గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు బోదన్, సాలూర మండలాల ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీఓ వెంకటేష్ జాదవ్, ఎంపీఓ మధుకర్, తహసీల్దార్ గంగాధర్, సీడీపీవో జానకి, ఎంపీటీసీలు, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన

రుద్రూరు, జూలై 2 : రుద్రూరు మండలంలోని అంబం (ఆర్) ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిజామాబాద్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం బృందంచే విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ బృందం సభ్యులు సమాజంలో బాలిక విద్యా ప్రాధాన్యత, బాల్య వివాహాలు, సుకన్య సమృద్ధి యోజన, బాలిక విద్య, బేటి బచావో బేటి పడావో తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహనలో విద్యార్థులకు ఎన్నో అనుమానాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం బృందం సభ్యులు ఎం. కార్తీక, బానుప్రియ, పుష్ప, స్వప్న, ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపక బృందం, 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌రూరల్,జులై2: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉషోదయ కళాశాల డైరెక్టర్ దుశ్యంత్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో టాస్క్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు జరుగుతాయన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ, ఎంఎన్‌సీ క్యాంపస్ డ్రైవ్ సెలక్షన్స్ నిర్వహిస్తుందన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎంబీఏ విద్యార్థులు 2022-24 విద్యాసంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉదయం 9గంటలకు తమ సర్టిఫికేట్లతో హజరుకావాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత వచ్చేటప్పుడు తమ ఆధార్ కార్డు, రెజ్యూం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, అన్ని సర్టిఫికేట్లు తీసుకురావాలన్నారు. 2015నుండి ఉషోదయ విద్యాసంస్థలు ప్రతి సంవత్సరం బోధన్ పట్టణంలో డిగ్రీ విద్యా ద్వారా ఇంజనీరింగ్, బీటెక్ కళాశాలలకు దీటుగా క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తూ తక్కువ వ్యవధిలో డిగ్రీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారన్నారు.ఉషోదయ విద్యాసంస్థలు నిరంతరం విద్యా అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పన లక్ష్యంగా సర్వతోముఖంగా విద్యార్థులను తీర్చి దిద్దుతుందన్నారు.టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్, జెన్‌ప్యాక్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, శ్రీహరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోస్రాలో మద్యం తాగి ఒకరి మృతి



పర్మిట్ రూంలో మరణించిన శ్రీనివాస్

మోస్రా,జులై2: మోస్రా మండల కేంద్రంలోని వైన్స్‌లోని పర్మిట్ రూంలో ఓ వ్యక్తి మరణించిన ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి ప్రాణంపోయిన వైన్స్ యాజమానులు తమకేం పట్టనట్లు తమ వ్యాపారం చేసుకుంటూ ఉండిపోయారు. పోలీసులు వచ్చిన కనీసం మద్యం అమ్మడం ఆపలేదు. వివరాల్లోకి వెళితే.. బోధన్ రూరల్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన భైరగి శ్రీను తండ్రి సాయిలు వయస్సు 30సంవత్సరాలు ఇతనికి భార్య, పిల్లలు పది సంవత్సరాల పాపా, బాబు 8సంవత్సరాలు ఉన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో అతని బంధువు చనిపోతే అంత్యక్రియలకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో మోస్రా మండల కేంద్రంలోని వైన్స్‌కు అందాజా సాయంత్రం 4గంటల ప్రాంతంలో వచ్చి మద్యం సేవించి కక్కుకొని అక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసుకున్నామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. ఇక్కడ అమ్ముతున్న కల్తీ మద్యం తాగి మరణించాడని స్థానికులు మాట్లాడుకుంటున్నారు. ఈ కేసు దర్యాప్తులో సీఐ జయేష్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన యంచ గ్రామస్థుడు



వ్యక్తిని కాపాడుతున్న గ్రామస్థుడు

నవీపేట,జులై2: మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం పలువురు స్థానికులు కాపాడారు. నిర్మల్ జిల్లా బాసర మండలం మైలాపూర్‌కు చెందిన నగేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం యంచ గోదావరి బ్రిడ్జి నుంచి నదిలో దూకడానికి ప్రయత్నించాడు. ఇదే సమయంలో అటు వైపుగా వెళ్తున్న పలువురు యంచ గ్రామస్థులు వెంటనే అతనిని పట్టుకుని గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించి అతనిని వారికి అప్పగించారు. కుటుంబ కలహాలతోనే తాను ఈ అఘాయిత్యానికి పాల్పడబోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన లింగం, నారాయణ, సంతోష్‌లను గ్రామస్థులు అభినందించారు.

## నవీపేటలో అక్రమ నిర్మాణం నిలిపివేత

నవీపేట,జూలై2: మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో అక్రమంగా మరుగుదొడ్డి ట్యాంక్ నిర్మాణ పనులు చేపడుతుండగా పంచాయతీ అధికారులు మంగళవారం నిలిపివేశారు. స్థానిక అంగడిబజార్ పక్కనే ఉన్న ఓ కాంప్లెక్స్ యాజమాని అంగడిబజార్‌కు చెందిన స్థలంలో మరుగుదొడ్డి ట్యాంక్‌కు సంబంధించి పెద్ద గొయ్యి తవ్వించాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు డీపీవోతో పాటు స్థానిక పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశం మేరకు అక్రమంగా తవ్విన గుంతను జేసీబీ సాయంతో పంచాయతీ అధికారులు పూడ్చివేయించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ అధికారులు హెచ్చరించారు.



## బాల కార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

● అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు

ఎడపల్లి, జూలై 2: బడి ఈడు పిల్లలతో ఎవరైనా పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు అన్నారు. మంగళవారం ఎడపల్లి మడల కేంద్రంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న బాల కార్మికున్ని గర్తించి దుకాణం యజమానితో మాట్లాడి పిల్లలతో పని చేయించవద్దని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడతూ బాల కార్మికుల నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలో తనిఖీ చేయడం జరిగిందని, ఎవరైనా బాల కార్మికులతో పని చేయిస్తే యజమానికి 60 వేల రూపాయల జరిమానాతో పాటు 2 నుండి 6 నెలల వరకు జైలు శిక్ష ఉంటుందని ఆయన హెచ్చరించారు. బాల కార్మికులు లేని సమాజం నిర్మించుకోవడానికి ప్రతి ఒక్కరు పాటు పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ అనిల్, కానిస్టేబుల్ షౌకత్ బేగం, ఎన్జీఓ సభ్యురాలు మమత తదితరులు ఉన్నారు.

## పోచారాన్ని కలిసిన మోస్రా నాయకులు

మోస్రా,జూలై2: మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీమంత్రి, మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారి నియోజకవర్గంకు వచ్చిన సందర్భంగా బాన్సువాడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు తోట రాజు, సీనియర్ నాయకులు హరి నారాయణ, ఓబీసీ జిల్లా కార్యదర్శి అశోక్, శివ కుమార్, మాజీ వార్డు మెంబర్ ఖాసీం, అశోక్, తరుణం సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

నవీపేట,జులై2: రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, 3 నోటిఫికేషన్ అదనంగా పోస్టులను పెంచాలని జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు బండారి రాజశేఖర్, వెంకటేష్, బాలు గౌడ్, నంద వంశీ, దినేష్, శివ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మీ,షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, జూలై2: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను ఎంపీపీ సామ పద్మ చేతుల మీదగా అందజేశారు. ముప్కాల్ మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మీ 28, షాదీముబారక్ రెండు చెక్కులు మంజూరు కాగా ముప్కాల్‌లో పది, కొత్తపల్లిలో ముగ్గురికి, నాగంపేట్‌లో ఒక్కరికి, నల్లూర్‌లో ఐదుగురికి, రెంజర్ల ఆరుగురికి, వేంపల్లిలో ఐదుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ తహసీల్దార్ శ్రీధర్, సామ వెంకట్‌రెడ్డి, సంద రవి, చిన్నారెడ్డి, బద్దం సాగర్, ముస్కు మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి, లబ్దిదారులు పాల్గొన్నారు.

## నాగంపేట్‌లో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ముప్కాల్, జూలై2: మండలంలోని నాగంపేట్ గ్రామంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి స్థానంలో మెండోర, ద్వితీయ స్థానంలో నాగంపేట్ జట్టు నిలిచాయని ఆర్గనైజర్ మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్‌రెడ్డిలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్, అనిల్, రెడ్డిస్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

బోధన్‌రూరల్,జులై2: బోధన్ మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల సేవలు మరువలేనివని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికురాలు లక్ష్మి పదవి విరమణ పొందడంతో ఆమెను తమ వార్డులోని కాలనీవాసుల మధ్య సన్మానించారు. తెల్లవారుజామునే పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పట్టణాన్ని సుందరీకరణగా ఉంచడంలో వీరి పాత్ర చాలా ముఖ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఏర్గట్ల, జులై 2: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో బోదాసు గంగాధర్ ఇటీవలే తాటి చెట్టుపై నుండి పడి మృతి చెందగా మంగళవారం మంగళవారం గ్రామంలోని యూఏఈ ఎన్నారై సభ్యులు ఆర్థిక సహాయంగా 50 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. యూఏఈ ఎన్నారై సభ్యులు ఉత్కం శ్యామ్ సుందర్ గౌడ్, బండి సృజన్, బోదాసు దేవేందర్, ఆడెం ప్రతాప్, ఆడెం గంగారెడ్డిలు పాల్గొన్నారు.

# షిఫ్టింగ్ యంత్రాలతో పొలాల వద్దకు కేజ్‌వీల్స్ ట్రాక్టర్

• రోడ్డుపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిప్పకుండా చర్యలు • షిఫ్టింగ్ యంత్రాలతో తరలింపు • ఖర్చు అయినా.. సహకరిస్తున్న రైతులు



షిఫ్టింగ్ యంత్రాలతో తరలిస్తున్న కేజ్‌వీల్స్



కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్‌పై ఎక్కించుకొని వెళ్తున్న దృశ్యం

డొంకేశ్వర్, జూలై2: వరినాట్లు వేయాలంటే కేజ్‌వీల్స్‌తో పొలాన్ని దమ్ము చేయాలి. కానీ కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు ఒక చోట నుంచి మరో చోటికి తారురోడ్డుపై వెళ్లే కోట్లాది రూపాయలు పెట్టి వేసిన తారు రోడ్లు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరగడంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతాయి. చాలా కాలం పాటు నాణ్యతగా ఉండాల్సిన రోడ్డు వేసిన కొది్దపాటి రోజులకే గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారవుతున్నాయి. దీంతో ట్రాక్టర్ యాజమానులు రోడ్లను కాపాడేందుకు ప్రత్యేకంగా ఆలోచించారు. గతంలో పోలీసు శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించిన విధంగానే రోడ్లు ధ్వంసం కాకుండా ఉండేందుకు తమ వంతు కట్టడి చేసుకున్నారు. డొంకేశ్వర్, తొండాకూర్ గ్రామాల ట్రాక్టర్ యూనియన్ యాజమానులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్ పొలానికి తరలించేందుకు ప్రత్యేకంగా ట్రాలీని ఏర్పాటు చేసుకున్నారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్ ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాలీకి తరలించే ట్రాలీపై కేజీవీల్స్ ట్రాక్టర్‌ను ఎక్కించి అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు. ఇక్కడ పని పూర్తవ్వగానే మళ్లీ ఎక్కించి మరో చోటకు మళ్లీ ట్రాలీపైకి ఎక్కించి తరలిస్తున్నారు. దీని ద్వారా ఎవరైతే రైతు పొలాన్ని కేజ్‌వీల్‌తో కరిగేట్ చేయాలనుకుంటున్నారో ఆ ట్రాక్టర్ యాజమాని షిఫ్టింగ్ యంత్రానికి రూ.500లు చెల్లిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మరో విధంగా కూడా కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను తరలిస్తున్నారు. సాధారణ ట్రాక్టర్ వెనుక కేజీవీల్స్ ట్రాక్టర్‌పైకి కేజ్‌వీల్స్ చక్రాలు రోడ్డుపై తిరగకుండా టైర్లతో కూడిన ముందు చక్రాలు మాత్రమే రోడ్డుపైకి తిరుగుతూ కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను రైతులు పొలంలోకి ఒక్క చోట నుంచి మరో చోటికి తీసుకువెళ్లేందుకు ఆలోచించారు. రైతులకు దీని ద్వారా పొలంలోకి తీసుకువెళ్లేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై తిరిగే అవకాశం లేకుండా పోయిన రైతులకు భారమైన రోడ్లు ధ్వంసం కాకుండా అధికారులు అవగాహన కల్పించిన విధంగా రైతులు ముందుకు సాగుతున్నారు.

### రోడ్లు ధ్వంసం కాకుండా కాపాడేందుకే



ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన రోడ్లను కాపాడేందుకు గాను ట్రాకర్ట్ యజామానులం దరు కలిసి షిప్టింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం, దీని ద్వారా కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల ఒక చోటి నుంచి మరో చోటికి రోడ్లపై తిరగకుండా సులువుగా షిప్టింగ్ యంత్రంపై తీసుకువెళ్తాం. రోడ్ల మీద కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరగినట్లయితే రోడ్ల మీద గుంతలు ఏర్పాడుతాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది ట్రాక్టర్ యాజమానులు అందరు కలిసి ఈ షిప్టింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

- నిమ్మల సురేష్, ట్రాక్టర్ యాజమాని, డొంకేశ్వర్

## కేజ్‌వీల్స్ ట్రాక్టర్ యజమానికి జరిమానా



రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్‌ట్రాక్టర్

డొంకేశ్వర్, జూలై2: డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో తారు రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను మంగళవారం ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు పట్టుకున్నారు. కేజ్‌వీల్స్‌తో నిబంధనలకు విరుద్ధంగా తారురోడ్డుపై తిరుగుతున్న ట్రాక్టర్‌నుపట్టుకొని యజామానికి రూ.1500 జరిమానా విధించారు. తారు రోడ్డుపై ట్రాక్టర్లు తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను షిఫ్టింగ్ యంత్రాలు కేజ్‌వీల్స్‌కు పట్టీలు ఏర్పాటు చేసి పొలాల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేశామని ఆయన తెలిపారు.

## రూ.50 కోట్లతో మండలాన్ని అభివృద్ధి చేశాం

• ఎంపీపీ లత • ముగిసిన ఎంపీటీసీల పదవీకాలం



ఎంపీటీసీలను సన్మానించిన అధికారులు

మోపాల్, జూలై 2:అందరి సహకారంతో మండలాన్ని ఐదేళ్ల కాలంలో సుమారు రూ.50కోట్ల వ్యయంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మోపాల్ మండల పరిషత్ అధ్యక్షురాలు లత అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ఈనెల 3వ తేదీన ముగియడంతో మంగళవారం మండల అభివృద్ధి అధికారి ఎంపీటీసీలకు సన్మాన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో అందరి సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. తాము పదవిలోకి రాగానే రెండు సంవత్సరాలు కరోనాతోనే గడిచిపోయిందని అయినప్పటికి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఈఐదేళ్ల కాలంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమకు సహకారాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనితతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు. అనంతరం వీరందరికి ఎంపీడీవో మండల స్థాయి అధికారులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింగం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు ఇళ్లను మంజూరు చేయాలి

డొంకేశ్వర్, జూలై2: వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలని ఏఐకెఎంఎస్ అధ్యక్షుడు కె.గంగాధర్ మంగళవారం డొంకేశ్వర్ మండలంలోని తహసీల్దార్ వెంకటరమణకు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.12వేల హామీని నెరవేర్చాలని, బీడీ, గీతకార్మికులకు ఇస్తున్న రూ.2016లాగానే వ్యవసాయ కార్మికులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తీసుకువచ్చి 60ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ అందించాలన్నారు. అన్ని రోగాలకు వర్తింపజేసే విధంగా హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని, ఇండ్ల నిర్మాణానికి స్థలం కేటాయించి రూ.10లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, దేవన్న, కూశన్న, వంజరి, గంగాధర్, ఉమ్మెడ గంగారాం, జువ్వన్న, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్‌రూరల్,జులై2: విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే.ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా కే.రమేష్ చారి, కోశాధికారిగా నారోజి వెంకట రమణ చారి, ఉపాధ్యక్షులుగా వడ్ల శంకర్, సురేందర్ చారి, ముఖ్య కార్యదర్శిగా ఎం.రాజశేఖర్, కే.రమణ చారి, ప్రచార కార్యదర్శి వీరేశం చారి, కార్యవర్గ సభ్యులుగా పీ.శంకర్ చారి, కే.రాము చారి, ఏ.కృష్ణ చారి, ఎస్.హరీష్ చారి, గంగాధర్ చారి, రాములు, సుదీప్ చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. సలహదారులుగా రాందాస్ చారి, మారోజు మురహరి చారి, పీ.లక్ష్మణ్ చారి, నాగభూషణం చారి, బాలాజీ చారి, సుధాకర్ చారి, కే.కాళిదాస్ చారి తదితరులు ఎన్నికయ్యారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



పోలీస్ స్టేషన్‌కు తరలించిన మొరం టిప్పర్

కోటగిరి,జులై2: మొరం, ఇసుక అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య హెచ్చరించారు. పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం సమీపంలో మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌తో పాటు పొతంగల్ మండల కేంద్రంలో మంజీర నది సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ పట్టుకున్నారు. మొరం టిప్పర్‌కు, ఇసుక ట్రాక్టర్‌కు 5వేల రూపాయల చొప్పున జరిమాన విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 'పారదర్శకంగా పదోన్నతులు, బదిలీల నిర్వహణ'

నిజామాబాద్ అర్బన్, జూలై 2: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారికి పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమీలుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు క్యాడర్ స్ట్రెన్త్ త్వరగా ఇచ్చి సప్లై మానిటరి వేతనాలు చేసుకునే విధంగా ప్రొసిడింగ్స్ ఇవ్వాలని డిఇవోను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమణాచారి, శ్రీమన్నారాయణ, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

**• వ్యాయామ ఉపాధ్యాయుల కృతజ్ఞతలు...**

వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులను నిర్వహించినందుకు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌కు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్‌లు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలను సమన్వయపరుస్తూ జిల్లాలో సమర్థవంతంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను డిఇవో నిర్వహించారని కొంత మంది కావాలనే డిఇవోపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని మానుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై అక్రమాలు జరిగినట్లు ప్రచారం జరుగుతుందని కానీ ఏ ఒక్క వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాశాఖలో ఏ ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదని కావాలని కొంత మంది చేస్తున్న ప్రచారం అన్నారు.

**• పీఆర్టీయూ తరపున ధన్యవాదాలు**

జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను సమర్థవంతంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారికి పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్‌లు ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ప్రమోషన్లతో పాటు ఎస్‌జిటిల ప్రమోషన్లు, ఇతర ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను రోస్టర్ కమ్ మెరిట్ లిస్టులన్నీ కూడా డిఎస్‌ఇలోనే అధికారులు తయారు చేసి జిల్లాలకు పంపించారని జాబితాల తయారీలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఎలాంటి పాత్ర లేదని కొంత మంది కావాలనే క్యామ్ స్కానర్ స్కామ్ అంటూ డిఇవోపై విషప్రచారం చేస్తున్నారని అవగాహన లేని ఇలాంటి ప్రకటనలు చేయడం సరికాదని వారు అన్నారు. పిఆర్‌టియు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

## భూకబ్జాను అడ్డుకున్నందుకు దంపతులపై దాడి



గాయపడ్డ క్షతగాత్రులు గంగాధర్, తులసమ్మ

ఇందల్వాయి, జూలై 2: ఇందల్వాయి మండలంలోని గౌరారం పరిధిలోగల సర్వే నంబర్ 180లో భూమిని కబ్జా చేస్తున్నారని తన భూమిని కబ్జా చేయడం సరికాదని అడ్డుకున్నందుకు లింగాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి తమపై దాడి చూసి తీవ్రంగా గాయపరిచారని గ్రామానికి చెందిన తులసమ్మ, గంగాధర్‌లు మంగళవారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 180లో గల 22 గుంటల భూమిని తమకు ప్రభుత్వం గతంలో కేటాయించిందని అట్టి భూమిలో గత పది సంవత్సరాల నుంచి తామే వ్యవసాయం చేసుకుంటున్నామని అన్నారు. ఈ భూమిపై కన్నేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి తమను బెదిరిస్తూ కబ్జా చేయాలని చూస్తున్నారని మంగళవారం జెసిబి ట్రాక్టర్లతో చదును చేస్తుండగా తాము అడ్డుకున్నందుకు భార్యభర్తలిరువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు తెలిపారు. అలాగే నోటికొచ్చినట్లు బూతులు తిట్టి తమను కించపరిచారని ఆరోపించారు. అతనిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సోమవారం ప్రజావాణిలో ఈ భూమి విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సంతోష్‌రెడ్డి వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని అతని బారి నుండి తమను కాపాడాలంటూ పోలీసులను ఆశ్రయించారు. తమ భూమిని తమకు ఇప్పించాలని మంగళవారం తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లి రెవెన్యూ అధికారులతో మొరపెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి నిజానిజాలు తెలుసుకొని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు.

## మోస్రా పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ




రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో



భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మోస్రా,జూలై2: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో డీఈవో దుర్గాప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి మంచిగా చదవాలి అందరు పదికి పది జీపీఏ సాధించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి ఉపాధ్యాయ రిజిష్టర్ తనిఖీ చేశారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో అసంపూర్ణంగా నిర్మాణంలో ఉన్న వంటగదులను, మూత్రశాలలు త్వరగా పూర్తి చేసేలా చూస్తామని అందుకు సంబంధించిన పూర్తి వివరాలు రాత పూర్వకంగా ఇవ్వాలి అని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభబాయికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్‌తో పాటు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ఉపాధ్యాయులు రాజేశ్వర్, స్వరూప రాణి, సంజయ్ కుమార్, వాణి తదితరులు పాల్గొన్నారు.

## పది ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలని తీర్మానం




ఏర్గట్లలో మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ నర్సయ్య

ఏర్గట్ల, జూలై 2: మండల కేంద్రంతో పాటు తాళ్ళరాంపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో మంగళవారం చైర్మన్‌లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌లు మాట్లాడుతూ రైతు సాగు చేస్తున్న ఒక్క పట్టాదారు పాస్‌పుస్తకంపై ఎంత భూమి ఉన్నా గానీ పది ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మాణం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకర ఆడిట్ అధికారి పాపయ్య మానిటరింగ్ అధికారిణి మంజుల దేవి, కొట్టాల శ్రీనివాస్ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, డైరెక్టర్‌లు బద్ధం హన్మండ్లు, రేండ్ల రాజారెడ్డి, బద్ధం ప్రభాకర్, సీఈవోలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని రైతు బంధు భవనంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మహాజన సభ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు పథకాన్ని పది ఎకరాల వరకు వర్తింపజేయాలని తీర్మానం చేశారు. అంతేగాక రైతులు సూచనలు, సలహాలను అధికారులు రాత పూర్వకంగా తీసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి పాపయ్య, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంఘ ఆడిటర్ మంజుల దేవి, మండల వ్యవసాయాధికారి లావణ్య, వ్యవసాయ విస్తీర్ణాధికారులు శ్రీలత, మహేష్, డైరెక్టర్‌లు మహిపాల్, బాలమల్లేష్, ముత్యాల లక్ష్మణ్, సత్తెమ్మ, ఎలాల భూమారెడ్డి, శంకురి భూమేశ్వర్, కుంట అశోక్‌రెడ్డి, సంఘ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**రుద్రూరు:** రుద్రూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక మహాజన సభ సమావేశం సహ కార సంఘం చైర్మన్ బద్దం సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నటు సొసైటీ కార్య దర్శి జి.లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసాపై సహకార సంఘాల సభ్యుల అభిప్రాయ సేకరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాజన సభకు ప్రభుత్వ అధికారి హాజరై అభిప్రాయాలను సేకరిస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్

ఆర్మూర్‌టౌన్ , జూలై2: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో పాటు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలంలో డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మున్సిపల్ అధికారులకు విద్యార్థులకు ఆయన సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, అర్బన్ యూనిట్ అధికారి సాయి,మున్సిపల్ డీఈ భూమేశ్వర్; సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ప్రేమలత, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## 'నామమాత్రపు మద్దతు ధరలు పెంచడం సిగ్గుచేటు'



డిప్యూటీతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆర్మూర్‌టౌన్, జూలై2: కేంద్ర ప్రభుత్వం రైతులకు నామమాత్రపు మద్దతు ధరలు ప్రకటించడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్‌అన్నారు. మంగళ వారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హరీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జున్ 19న 14పంటలకు మద్దతు ధరలను పెంచుతున్నట్టు ప్రకటించిందని, గత ఏడాది నిర్ణయి ంచిన ధరల కంటే ఐదు నుంచి ఏడు శాతం మాత్రమే పెంచారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20నుంచి 22శాతం వరకు పెరిగాయని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగటి భూవనేశ్వర్, జిల్లా నాయకులు చల్ల గణేష్, గంగారాం, నవీన్, జయ, తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకొని పని చేయాలి



ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డిని సన్మానిస్తున్న మండలస్థాయి అధికారులు

నందిపేట, జూలై2: ప్రజాప్రతినిధులు ఏవరైనా సరే వారికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని సమర్థవంతంగా పని చేయాలని ఇంచార్జీ డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటీసీలకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల కాలపరిమితి శాశ్వతం కాదని, ప్రజల గుండేల్లో నిలిచిపోయేలా ప్రతీఒక్కరు పని చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ఐదుసంవత్సరాల పదవి కాలంలో తనకు సహకరించిన ఎంపీటీసీసభ్యులు, అధికారుల పనితీరును చెప్పుకుం టూ భావోద్వేగాని గురైనారు.తన తండ్రివాకిడి నర్సయ్య కోరిక మేరకే ఎం పీటీసీగా గెలిచి ఎంపీపీని అయ్యానని తెలిపారు. అనంతరం ఎంపీపీ, జడ్పీ టీసీ సభ్యురాలు వైఎస్ఎంపీపీ, ఎంపీటీలను మండలస్థాయి అధికా రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఆనంద్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు ఏర్రం యమున, మండల కోఆప్షన్‌సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఆయా గ్రామాల ఎంపిటీసీసభ్యులు, పం చాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ముగిసిన స్థానిక సంస్థల పదవీకాలం



బాల్కొండ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ముప్కాల్, జూలై2: స్థానిక సంస్థల పదవీకాలం రేపటితో ముగియనుంది. మంగళవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో విడ్కోలు సమావేశం నిర్వహించారు. 2019లో కొలువు దీరిన పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈ పాలకవర్గాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల, శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్; ఎంపీడీవో విజయభాస్కర్‌రెడి, ఎంపీవో వెంకటేశ్వర్‌లు,ఏపీవోఇందిరా,ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు.

**ఆర్మూర్‌రూరల్:** ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో మంగళవారం ఎంపీటీసీ, మాజీసర్పంచ్ యాల్ల రాజ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ బండమీది గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. మరో రెండు రోజులు పదవీ కాలం పూర్తి కానందున ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఇటీవలి వరకు ఉపసర్పంచ్‌గా పని చేసిన బండమీది గంగాధర్‌ను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌చైర్మన్ మహిపాల్, పంచాయతీకార్యదర్శి సుకన్య, లైన్‌మెన్ గోపాల్, హెచ్‌ఎంలు ఇందిరా,అనసూయ, నాయకుడి వెంకన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎడపల్లి:** మండలంలోని కుర్నాపల్లి గ్రామ ఎంపిటీసి వెంకయ్యాగారి రాంరెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ కాలం ముగియడంతో గ్రామ ప్రత్యేక అధికారి గబ్బర్ సింగ్, పంచాయితీ కార్యదర్శి, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ కాలంలో వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులను ఎవరినైనా బాధ పెడితే క్షమించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కంచరి రమేష్(ఫైల్

నవీపేట,జులై2: మండలంలోని కోస్లీలో విద్యుద్ఘాతంతో కంచరి రమేష్(43)అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షంతో తన ఇంటి రేకులు గాలికి కొద్దిగా ఎగిరిపోయాయి. రేకులు ఎగిరిపోయే సమయంలో కరెంట్ స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే సర్వీసు వైరుకు చెందిన ఇన్సులేషన్ తొలగిపోయింది. వర్షం తగ్గిన తర్వాత రమేష్ తన ఇంటి రేకులను సరి చేస్తుండగా కరెంట్ వైరుకు చెందిన ఇన్సులేషన్ తొలగిపోయిన భాగానికి రేకు తగలడంతో వెంటనే అతనికి విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో అతనిని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రమాదం జరిగిన సమయంలో భార్య లక్ష్మి కూలీ పనికి వెళ్లింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నగరంలో మేయర్ నీతూకిరణ్ పర్యటన



నగరంలో పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న మేయర్

సుభాష్‌నగర్, జూలై 2: నగరంలోని పలు ప్రాంతాల్లో మేయర్ మంగళవారం పర్యటించారు. నగరంలోని శ్రీరాంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీలో పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశించారు. కొన్నిచోట్ల డ్రైనేజీ అస్తవ్యస్థంగా ఉండటంతో జెసిబి సహాయంతో డ్రైనేజీని తీసివేయించారు. అంతేకాకుండా పిచ్చిమొక్కలు పెరగడంతో సిబ్బందిని పిలిపించి వాటిని కూడా తొలగింపజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల ముందుండే దేవుళ్లే వైద్యులు: డీఎంహెచ్‌వో



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 2: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించే కన్నుల ముందుండే దేవుళ్లే వైద్యులు అని డిఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం అన్నారు. మంగళవారం నగరంలోని ఐఎంఎ హాల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ బిసి రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కోసం లక్షలాది మంది డాక్టర్లు ఆసుపత్రుల్లో అందిస్తున్న నిరంతరం ఇతర సేవలకు గుర్తింపుగా భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి జూలై 1న రావడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తుందని అన్నారు. డాక్టర్ బిసి రాయ్ పేద ప్రజల వైద్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసి అందించిన వైద్య సేవలు రానున్న తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యులు దామోదర్‌రావు, కొట్టూరు శ్రీశైలం మాట్లాడుతూ జిల్లాలో విధినిర్వహణలో ప్రజల ప్రాణాలను రక్షించడానికి అత్యవసరమైన సమయంలో వైద్యులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వైద్య వృత్తిలో సమాజానికి సేవలు అందించిన వారికి సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగమోహన్, బండారి సుజాత, వెంకటరమణ, చంద్రకళ, రాజేంద్రప్రసాద్, బెల్లం తిరుపతిరావు, శ్రీహరి, దీపక్‌రాథోడ్, నీటిరాంచందర్, వినోద్‌కుమార్‌గుప్త, కవిత, జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజూ కొనసాగిన అంగన్‌వాడీలకు శిక్షణ



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎడపల్లి, జూలై 2: నూతన జాతీయ విద్యా విధానంపై ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణ మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీసెంటర్ లోప టల, బయట వాతావరణాన్ని ఎలా ఉంచుకోవాలి, 3 నుండి 6 సంవత్సరాల పిల్లల హాజరు శాతాన్ని పెంచడానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, పూర్వ గణిత, లిఖిత, పఠన భావనాలు పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి అవకాశాలు కల్పించాలి, అంశ పద్ధతిలో రోజువారీ పది కృత్యాల ద్వారా ఎలా బోధించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ ఆసియా బేగం, రాధా లక్ష్మి, సూపర్ వైజర్లు విజయ రాణి, ప్రమీల రాణి, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ రాంబాబు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

**మోపాల్:** నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా రివైజ్డ్ ప్రీ స్కూల్ కరికులం ట్రైనింగ్‌లో భాగంగా గూపన్‌పల్లి రామకృష్ణ ధ్యాన మందిరంలో మంగళవారం అంగన్‌వాడి టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిడబ్ల్యువో రసూల్‌బీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పిల్లలు శారీరకంగా అభివృద్ధి సాధించాలన్నారు. మేధోఅభివృద్ధి సామాజిక భావోద్వేగా నైతిక పరంగా అభివృద్ధి సాధించాలన్నారు.1వతరగతిలో చేరడానికి కావాల్సిన సంసిద్ధులుగా తయారు చేయ డం కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శకుంతలాదేవి, ట్రైనీ ప్రియదర్శిని, సూపర్‌వైజర్ రమాదేవి,సీత, స్వరూప, ఆయా గ్రామాల అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## నేడు రూరల్ ఎంపీటీసీలకు వీడ్కోలు

నిజామాబాద్ రూరల్, జూలై, 2: నిజామాబాద్ రూరల్ మండలానికి చెందిన ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధురిమ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బానోతు అనూ ష, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఇతర ఎంపీటీసీల పదవీ కాలం పూర్తికా నుంది.దాంతో మర్యాదపూర్వకంగా వారికి వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు,ఈకార్యక్రమంలో రూరల్ మండల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొనాలని ఎంపీడీవో మధురిమ కోరారు.

## 10న డిచ్‌పల్లిలో జగన్నాథ రథయాత్ర

డిచ్‌పల్లి,జూలై 2: ఇస్కాన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో 10వ తేదీన డిచ్‌పల్లి మండల కేంద్రంలో కాశీవిశ్వనాథ ఆలయం వద్ద జగన్నాథ రథయాత్ర కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సిద్ధ బలరాందాస్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

పెద్దబజార్, జూలై 2: కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ సాక్షిగా చట్టసభల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ హిందువులు, హింస, అసత్యం, ద్వేషం రెచ్చగొడుతారని యావత్ హిందువులను అవమానించే విధంగా హింసపరుస్తూ మాట్లాడిన తీరును తీవ్రంగా మండిపడ్డారు. పదేళ్ల తర్వాత గానీ ప్రతిపక్ష హోదా రాని కాంగ్రెస్ పార్టీ మొన్న జరిగిన ఎన్నికల్లో వంద సీట్లు కూడా గెలవని రాహుల్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే హిందువుల వ్యతిరేక పార్టీ అని గత 70 ఏళ్ల నుంచి హిందువులను వివక్షకు గురి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఓ వర్గంపై తెగ ప్రేమ ఒలకబోస్తోందని కేంద్రం ఉగ్రవాద సంస్థలను గుర్తించి నిషేధించిన జమాతే ఇస్లామి సంస్థకు ప్రభుత్వం నుంచి 2కోట్లు విడుదల చేయడం సబబు కాదన్నారు.

● రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

**పెద్దబజార్:** హిందువులపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని 25వ డివిజన్ శక్తికేంద్ర ఇన్‌చార్జి పల్నాటి కార్తిక్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీజేపీని, హిందువులను అవమానించే విధంగా హిందువులంటే అసత్యం, హింస, విద్వేషం అని మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. భారతదేశం సురక్షితంగా ఉందంటే కారణం ఈ దేశంలో ఉన్న హిందువులని, బీజేపీ కార్యకర్తలు ఉన్నంత వరకు ఈ దేశాన్ని భారతమాతను కాపాడుకుంటామని తెలిపారు. ఇకపై హిందువులపైన తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ప్రశాంత్, జగదీశ్, వంశీ, భాస్కర్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

## 'ఆర్ఎంపీ, పీఎంపీలపై చేస్తున్న దాడులను నిలిపివేయాలి'

పెద్దబజార్, జూలై 2: తెలంగాణ రాష్ట్రంలో టీఎస్ ఎంసీ ఆర్ఎంపి, పీఎంపీలపైన చేస్తున్న దాడులను నిలిపివేయాలని తెలంగాణ ఆర్ఎంపీ, పిఎంపి సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేయాలని కోరారు. శిక్షణ తరగతులను మధ్యలో నిలిపివేసిన దానిని పునరుద్ధరించాలన్నారు. అండర్ ఎయిజ్‌తో శిక్షణ ఇవ్వని వారికి ఇకనుంచి వైద్య వృత్తిలో ఉన్న ఆర్ఎంపి, పిఎంపిలందరికి గత దశాబ్దా కాలంగా అమలు జరుగనుందని 20 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సుబడిన వారందరికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 2023 శాసనసభ ఎన్నికల అభయహస్తం మెనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా జీవోను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం,నాయకులు రమేష్, శంకర్, బాలబ్రహ్మాచారి, వెంకట్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## 4న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 2: ఈ నెల 4న కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్‌లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్, విఘ్నేష్‌లు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకేజీలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని దీనివల్ల 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టిఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందని వారు అన్నారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న ప్రధానమంత్రి ఇప్పటికీ స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ఎన్‌టిఏ చైర్మన్ రాజీనామా చేయాలని, పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు, ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. ఈనెల 4న నిర్వహించే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేటు యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, పీడీ ఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, గణేష్, బోడ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఏర్గట్లలో చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏర్గట్ల, జులై 2: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్‌లు అందజేశారు. తహసీల్దార్ మహమ్మద్ యాసుఫ్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరీ అయ్యాయని, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆడెపు గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, లింగారెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎండు గంజాయి పట్టివేత

● నగరంలో ఎండు గంజాయిని తరలిస్తున్న ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, జూలై 2: ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 3కిలోల 30గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్లు స్వప్న, వెంకటేశ్‌లు తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా ఓ యువకుడి వద్ద 210 గ్రాముల గంజా యి దొరికిందని తెలిపారు. అతన్ని విచారించగా ఆదిలాబాద్ జిల్లా బైంసా పట్టణంలోని ముజాహిద్ వద్ద నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సమాచారంతో ముజాహిద్‌ను వెంబడించగా గంజాయి ఉన్న బైక్‌ను వదిలేసి పారిపోయాడన్నారు. అతని వద్ద సుమారు 2కిలోల 10 గ్రాముల గంజాయి దొరికిందని తెలిపారు. ఈ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో ఒక వ్యక్తి రిశ్వంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.అతని వద్ద నుంచి బైక్‌ను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైనర్సింహాచారి,సిబ్బంది ఉత్తమ్,భోజన్న,రాంబచ్చన్,ఆశన్న,హమీద్,విష్ణు, మంజుల,అవినాష్, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చేసిన దృశ్యం

## టీబీని నిర్మూలించడమే లక్ష్యం

ముప్కాల్, జూలై2: 2025లోపు టీబీ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని డాక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశవర్కర్‌లకు బీసీజీ టీకాలపై శిక్షణ తరగతులు నిర్వహిం చారు. బీసీజీవ్యాక్సిన్‌ను ఆగస్టులో ప్రారంభిస్తున్నందు ముందుగా శిక్షణ తరగతులు నిర్వహి స్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కిసాన్ నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవీంధర్‌గౌడ్, ఎంపీహెచ్ఎస్ వాణి, వందన, ఆమ్స్, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

## రైతాంగ ఉద్యమాలను ఉధృతం చేస్తాం

● రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

డిచ్‌పల్లి,జూలై2:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తు రైతు లను సంఘటిత పరిచిరైతాంగ ఉద్యమాలను ఉధృతం చేస్తామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య అన్నారు. మంగళంవారం మెంట్రాజ్‌పల్లిలో ఏఐకేఎంఎస్ జనరల్ బాడీస మావేశం దేవస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోదీ ఎంఎస్‌పీ మద్దతు ధరల గ్యా రంటీ చట్టాన్ని తీసుకువస్తానని రైతు ఉద్యమానికి ఇచ్చిన హామీ అమలు పరచలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రతి నిధులు దేవ స్వామి, జేపీ గంగాధర్, సుప్రియ, మీనాయ్య, రాణి, గోదావరి, పెద్దక్క, శాంత, కంజర, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## ధర్పల్లిలో పలు ఆలయాల్లో చోరీకి యత్నం

ధర్పల్లి,జూలై 2:మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి, రేణుక ఎల్లమ్మ ఆల యాలతో పాటు మండల శివారులోని మదుల్ లక్ష్మి నర్సింహాస్వామి దే వాలయాల్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల గేటు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారులు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఆలయ కమిటీ, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హుండీలను పగలగొట్టి ధ్వంసం చేసినప్పటికీ హుండీలో నగదు లేకపోవడంతో అపహరణ జరగలేదని ఎస్సై తెలిపారు.ఆలయకమిటీ వారు ఆలయాల్లో బంగారుఆభరణాలను,నగదు ఉంచకపోవడంతో చోరీకి గురికాలేదని ఎస్సై తెలిపారు.ఆలయ కమిటీస భ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తైక్వాండో క్రీడాకారుడికి అభినందన



రాజేష్‌ను అభినందిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, జూలై 2: అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన రాజేష్‌ను మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారని ముఖ్యంగా జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారని వారందరికి ఎల్లప్పుడు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ హీరాలాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

## 8, 9న రాష్ట్ర క్రీడా పాఠశాల ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయి ఎంపికలు

సుభాష్‌నగర్, జూలై 2: ఈనెల 8, 9వ తేదీలలో రాష్ట్ర క్రీడా పాఠశాల ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. ఈనెల 27వ తేదీన రాజారాం స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికలో ముగ్గురు బాలికలను, ఇద్దరు బాలురను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. 8, 9 తేదీల్లో హకీంపేట్‌లో జరిగే ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 7న ఉదయం 10గంటలలోపు ధ్రువీకరణ పత్రాలతో సుభాష్‌నగర్‌లోని జిల్లా యువజన మరియు క్రీడలశాఖ కార్యాలయంలో హాజరుకావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు బాలుర విభాగంలో నవాతే సాయిగణేష్, ఎం.లిఖిత్, బాలికల విభాగంలో ఎర్రోళ్ల హేమావర్షిని, సిరిసిల్ల పార్థచందన, గైని మన్వితలు ఎంపికైనట్లు తెలిపారు.

## డిగ్రీ వన్ టైం పరీక్షలకు 22మంది విద్యార్థుల గైర్హాజరు



కామారెడ్డిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్

డిచ్‌పల్లి,జూలై 2:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోనిడిగ్రీ వన్‌టైం పరీక్షలు మంగళవారం ప్రారంభయ్యాయని టీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం ,మధ్యాహ్నం రెండు విడతలుగా మొత్తం 4 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 203 మందికి గాను 22మంది హాజరయ్యారు. 22మంది గైర్హాజర య్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తనిఖీ చేశారు.
















## చికెన్ ధరలు



| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.150 | రూ.280 | రూ. 300 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.155 | రూ.285 | రూ. 305 |



## బంగారం ధరలు



| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.72800 | రూ.67,100 | రూ.920 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్**

స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్క్రీన్-2 : కల్కి (3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
: మహారాజ (4.10)
స్క్రీన్-4 : కల్కి (తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి (హిందీ) (6.45, 10.15)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (3.10, 7.00, 10.40)
స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (10.30)
: కల్కి (తెలుగు 3డి) (4.00, 7.30, 10.45)
స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (1.30)

దేవి : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్